## క్లుప్తంగా

### నూజివీడులో భారీ వర్షం

నూజివీడు: పట్టణంలో మంగళవారం భారీ వర్షం పడింది. మధ్యాహ్నం 3.45 గంటల ప్రాంతంలో ప్రారంభమైన వాన సాయంత్రం ఐదు గంటల వరకు పడుతూనే ఉంది. భారీ వర్షంతో పట్టణంలోని డ్రెయినేజీలన్నీ వరదనీటితో పొంగి పొర్లాయి. ఈ వర్షంతో పట్టణంలో జనజీవనం స్తంభించింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ఉద్యోగులు వర్షంలో తడుచుకుంటూనే ఇళ్లకు చేరుకున్నారు. గడిచిన రెండు నెలల్లో ఇదే భారీ వర్షమని స్థానికులు పేర్కొన్నారు. ఈ వర్షం ఎండిపోతున్న పంటలకు సైతం ఎంతో ఉపయోగకరమని, వాటికి ఊపిరి పోసిందని రైతులు పేర్కొంటున్నారు.

### ఎన్టీటీపీఎస్‌లో ఆక్యుపంక్చర్ దినోత్సవం



ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో ప్రపంచ ఆక్యుపంక్చర్ చికిత్స దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆక్యుపంక్చర్ సైన్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీటీపీఎస్ ఏర్పాటు చేసిన శిబిరాన్ని చీఫ్ ఇంజినీర్ నవీన్ గౌతమ్ ప్రారంభించారు. ఆక్యుపంక్చర్ చికిత్సతో ఎటువంటి దుష్ఫలితాలు, ఖర్చులు ఉండవన్నారు. ఈ విధానంలో చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తదితరులు ఆక్యుపంక్చర్ చికిత్స విధానం ప్రాక్టికల్‌గా తెలియజేశారు.

### విరూపాక్షేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడులో ఇటీవల ప్రతిష్టా మహోత్సవం జరుపుకున్న లలిత త్రిపురసుందరీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్, ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక రాము మంగళవారం సందర్శించారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు వేద మంత్రోచ్ఛరలతో మేళతాళాలతో సాదర స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలుతో పాటు వేద ఆశీస్సులు అందించారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, ఎంపీపీ పాలడుగు జోత్స్న, జికొండూరు ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో వెల్లివిరుస్తున్న సంక్షేమం, అభివృద్ధి

**ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్**



జూపూడిలో సచివాలయం అదనపు భవనం ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్యే వసంత

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ అన్నారు. కొటికలపూడిలో రూ. 25.25 లక్షలతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన భవనం జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తాతినేని పద్మావతితో కలసి మంగళవా రం ఆయన ప్రారంభించారు. రూ.2.52 కోట్లతో గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

**సచివాలయాలు గ్రామ దేవాలయాలు**

సంక్షేమ అభివృద్ధి పథకాల అమలుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్‌లు, ఆర్బీకేలు గ్రామ దేవాలయాలని జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక అన్నారు. జూపూడిలో రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ అదనపు భవనం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్లను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో కలసి ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జూపూడిలో 1.70 కోట్లతో అభివృద్ధి జరిగిందన్నారు. లంక భూములు కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు పట్టాలు మంజూరుకు చర్యలు తీసుకున్నామన్నారు. సర్పంచ్ కాకి దేవమాత కోరిక మేరకు జగనన్న లేఅవుట్ అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, ఎంపీపీ పాలడుగు జోత్స్న, వైస్ ఎంపీపీలు నాగమణి, నాగబాలమ్మ, సర్పంచ్‌లు కాకి దేవమాత, రెంటపల్లి నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్‌లు జానీ, గాంధీ, ఎంపీడీఓ రామకృష్ణనాయక్, గ్రీనరీ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పోలగంగు రాణి, దుర్గగుడి ఆలయ కమిటీ సభ్యుడు చింకా శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి అనిల్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సాంబశివరావు, నాయకులు పాల్గొన్నారు.

**వ్యక్తిత్వం లేని వింతజీవి దేవినేని ఉమా**

విలువలు, సంస్కారం, వ్యక్తిత్వంలేని వింతజీవి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. కొటికలపూడిలో దేవినేని ఉమాపై ఎమ్మెల్యే వసంత ఘాటువ్యాఖ్యలు చేశారు. పచ్చకామెర్ల ఉన్నవాడికి లోకమంతా పచ్చగా ఉన్నట్లు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఉమా ఓర్వలేక పోతున్నాడని ఎద్దేవా చేశారు. కేవలం రాజకీయాలు అడ్డుపెట్టుకుని జీవితం వెళ్లదీస్తున్నాడని విమర్శించారు. తన వదినను చంపిన తర్వాత 20ఏళ్లు రాజకీయాలు చేసేందుకు అవకాశం లభించిందన్నారు. దేవినేని ఉమా విచిత్ర, వికృత చేష్టలతో జిల్లాలో టీడీపీ తుడిచిపెట్టుకు పోయిందన్నారు. 2024 ఎన్నికల్లో ఉమాను రాజకీయంగా సమాధిచేయడం ఖాయమని మరోమారు మైలవరంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు.

# ‘ఏపీకి మళ్లీ సీఎంగా జగన్ ఎందుకు కావాలి’పై సమావేశం



తిరువూరులో సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి



గంపలగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు కావాలి అనే కార్యక్రమ నిర్వహణపై తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి మంగళవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులతో సమావేశాలు నిర్వహించారు. గత నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి, చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించేందుకు ఈ నెల 9 నుంచి సచివాలయాల వారీగా షెడ్యూలు రూపొందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మార్గదర్శకాల ననుసరించి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఏకొండూరు, తిరువూరు టౌన్ వైఎస్సార్ సీపీ నాయకులతో ఈ సమావేశాలు నిర్వహించారు.

**గంపలగూడెంలో..**

గంపలగూడెం: ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కే రక్షణనిధి తెలిపారు. కార్యక్రమనిర్వహణపై మండల పార్టీ నాయకులతో ఆయన మంగళవారం గంపలగూడెంలో చర్చించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, శామ్యూల్, నరసింహారావు, చెన్నకేశవరెడ్డి, దాసు తదితరులు పాల్గొన్నారు.

# మిర్చి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



చాట్రాయిలో మిర్చి సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖాధికారి

చాట్రాయి: మిర్చి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవన శాఖాధికారి హేమ తెలిపారు. మండలంలోని నరసింహారావుపాలెం, చాట్రాయి గ్రామాల్లో సాగు చేస్తున్న మిర్చి సాగుని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిర్చి పైరులో పసుపు, నీలిరంగు జిగురు అట్టలను అమర్చడం వలన తామర పురుగు ఉధృతిని నివారించవచ్చని చెప్పారు. తామర పురుగు, పేనుబంక ఉన్నట్లయితే 0.5 మిల్లీ లీటర్ల ఇమిడా క్లోప్రిడ్‌ని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని, కూత పురుగు కనిపిస్తున్నందున 10 వేల పీపీఎం వేప నూనెని ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఆమె సూచించారు.

### వరిపంట పరిశీలన



తిరువూరు మండలం కొమ్మిరెడ్డిపల్లిలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

కొమ్మిరెడ్డిపల్లి(తిరువూరురూరల్): మండలంలోని కొమ్మిరెడ్డిపల్లిలో వరిపంటను వ్యవసాయాధికారి పద్మ మంగళవారం పరిశీలించారు. వరి కోతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలియజేశారు. యంత్రాలతో కోత నిర్వహించడం, ధాన్యం నిల్వ చేయడంలో మెలకువలను వివరించారు. ఏఎస్ఓ అక్బర్ బాషా పాల్గొన్నారు.

# విద్యార్థులకు అభినందనలు



గొల్లపల్లి హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు

నూజివీడు: రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో పాల్గొన్న మండలంలోని గొల్లపల్లి హైస్కూల్ విద్యార్థులను మంగళవారం పలువురు అభినందించారు. ఇటీవల భీమవరంలో నిర్వహించిన ఫెన్సింగ్ పోటీల్లో పాఠశాలకు చెందిన ఐ ఉగ్ర, పీ నిఖిల్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే అనంతపురంలో నిర్వహించిన జూడో పోటీల్లో రాజేశ్వరి, మణికంఠ, బచ్చు శ్రావణి పాల్గొన్నారు. వీరిలో బచ్చు శ్రావణి జమ్మూ కాశ్మీర్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. వీరందరిని జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, గొల్లపల్లి సర్పంచ్ బొకినాల వెంకటేశ్వరమ్మ, హెచ్ఎం పొట్లూరి రాధికారాణి, మాజీ సర్పంచ్ ఎస్టీపీ వెంకటేశ్వర్లు తదితరులు అభినందించి మొమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మేరుగ లెనిన్, ఆరేపల్లి రాంబాబు, పీడీ పీ రవీంద్ర పాల్గొన్నారు.

### సీపీఎం బైక్ ర్యాలీ



నూజివీడులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

నూజివీడు: సీపీఎం ప్రత్యామ్నాయ రాజకీయ విధానంతో ప్రజల ముందుకు వచ్చిందని, అందులో భాగంగా ఈ నెల 15న విజయవాడలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని పల్లెర్లమూడి నుంచి నూజివీడు వరకు మంగళవారం సీపీఎం నాయకులు బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నూజివీడు మండల కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందని ఆరోపించారు. దీనిని అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు తిరుగుబావుటా ఎగురవేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు చల్లారి శివన్నారాయణ, ఘంటా పాపారావు, శామ్యేలు, లక్ష్మయ్య, గుర్రం ప్రసాద్, అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

### అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసు

తిరువూరు: తమిళనాడులోని అరుణాచలం పుణ్యక్షేత్రానికి తిరువూరు ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 25న ప్రత్యేక బస్సుసర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజరు వేణు తెలిపారు. 25న సాయంత్రం ఐదు గంటలకు తిరువూరులో బయలుదేరి 26వ తేదీ ఉదయం కాణిపాకం చేరుతుందని, దర్శనం అనంతరం శ్రీపురం, తదుపరి రాత్రికి అరుణాచలం చేరుతుందని పేర్కొన్నారు. భక్తులు గిరిప్రదక్షిణ, దర్శనం పూర్తి చేసుకున్న తదుపరి 27న కంచి, తిరుత్తణి, శ్రీకాళహస్తి మీదుగా 28వ తేదీ సాయంత్రం తిరువూరు చేరుతుందని తెలిపారు. ఆన్‌లైన్లో రిజర్వేషన్ చేయించుకోవచ్చని పేర్కొన్నారు. రానుపోను బస్‌చార్జీ రూ.2,800గా నిర్ణయించినట్లు తెలిపారు. ఇతర వివరాలకు 98856 61835లో సంప్రదించాలని పేర్కొన్నారు.

### బస్‌పాస్‌ల పంపిణీ



ఆగిరిపల్లి: విద్యార్థుల అభివృద్ధికి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు విశేషంగా కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు అన్నారు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సౌజన్యంతో ఆగిరిపల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లోని 230 మంది విద్యార్థులకు మంగళవారం బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, ఉపాధ్యక్షురాలు సుజన కుమారి, హెచ్ఎం పుష్పలత, నాయకులు గోళ్ల ఇస్సాకు, నాగులమీరా, మాజీ ఎంపీటీసీ శ్రీమన్నారాయణ, జెడ్పీ ఉన్నత పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రాంబాబు పాల్గొన్నారు.

# ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



తిరువూరు: తిరువూరు స్వామి అయ్యప్ప దేవాలయ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాతసేవ, గణపతి హోమం, అయ్యప్పస్వామికి పంచామృతాలతో అభిషేకం, పడిపూజ, సంకీర్తన నిర్వహించారు. ఎన్టీఆర్, కృష్ణా, ఖమ్మం జిల్లాల నుంచి అయ్యప్ప భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజారావు పర్యవేక్షించారు.

# ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయండి

**కలెక్టర్ ఢిల్లీరావు**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం మూడో ఆప్షన్ కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఢిల్లీరావు అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాల్లో పురోగతిపై కలెక్టర్ ఢిల్లీరావు విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలిసి హౌసింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కాంట్రాక్టర్ల వారీగా మ్యాప్ చేసిన ఇళ్లు, పూర్తయిన ఇళ్లు, వివిధ దశల్లో ఉన్న ఇళ్ల వివరాలను పరిశీలించారు. పనులను వేగవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గానికి సంబంధించి 10,991, తూర్పునకు సంబంధించి 7,781, పశ్చిమకు సంబంధించి 9,608 ఇళ్ల నిర్మాణాల పురోగతిపై చర్చించారు. నిర్మాణాల్లో సరైన పురోగతి చూపని కాంట్రాక్టర్లపై సమగ్ర నివేదికలు అందజేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లపై నిబంధనల మేరకు చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను గుర్తించి, తగిన పరిష్కారం చూపి ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ రజనీకుమారి, హౌసింగ్ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.






### సీవీ రామన్‌కు ఘన నివాళి

గానుగపాడు(తిరువూరురూరల్): తక్కువ ఖర్చుతో ప్రయోగాలు చేసి రామన్ ఎఫెక్ట్ కనుగొని భౌతికశాస్త్రవేత్త సర్ సీవీ రామన్ నోబెల్ బహుమతి పొందారని తిరువూరు మండలం గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు సాయిరాం అన్నారు. సర్ సీవీ రామన్ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం పాఠశాలలో నిర్వహించారు. రామన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల హెచ్ఎం ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు రాంప్రదీప్, సుదర్శన్, వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



తిరువూరు మండలం గానుగపాడులో రామన్ జయంతి

### లేగదూడల ప్రదర్శన



ప్రదర్శన కార్యక్రమానికి తమ లేగదూడలతో హాజరైన రైతులు

జి.కొండూరు: మండలంలోని చిన్ననందిగామ గ్రామంలో పశు సంవర్ధకశాఖ అధికారుల ఆధ్వర్యంలో లేగదూడల అందాల ప్రదర్శన పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు కృత్రిమ గర్భధారణ, లేగదూడల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటికి అందించాల్సిన పోషకాహారంపై రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. దూడల అందాల పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన రైతులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటీవ్ అధికారి డాక్టర్ శ్రీనివాస్, జగనన్న పాలవెల్లువ కమాండ్ కంట్రోల్ అధికారి డాక్టర్ కృష్ణమూర్తి, పశుసంవర్ధక శాఖ మైలవరం ఏడీ డాక్టర్ హరిహరనాథ్, వెలగలేరు పశు వైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### సొసైటీ సేవలపై కళాజాత



చాట్రాయి: కేంద్ర సహకార బ్యాంకు ద్వారా రైతులకు అందిస్తున్న మెరుగైన సేవలపై మంగళవారం చాట్రాయిలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా నాబార్డు సౌజన్యంపై, డిజిటల్ అక్షరాస్యత, ప్రధానమంత్రి జీవనజ్యోతి, సురక్షా బీమా, అటల్ పెన్షన్ యోజన, కిసాన్, క్రెడిట్ కార్డు, నగదు రహిత లావాదేవీలపై కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ వాసు పాల్గొన్నారు.


**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** — ఇబ్రహీంపట్నం శాఖ, ఇబ్రహీంపట్నం, కృష్ణాజిల్లా-521456. ఫోన్: 0866-2882268.

**స్వాధీనత ప్రకటన** (రూల్ 8(1) (స్థిరాస్తి కొరకు))

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (చట్టం 54 / 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 3 తో చదవబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇబ్రహీంపట్నం శాఖ.** అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు **తేది. 03-08-2023** న డిమాండ్ నోటీసు జారీచేసి సదరు నోటీసు అందుకున్న తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన బకాయి **రూ.10,07,175.88 పై (అక్షరాల పది లక్షల ఏడు వేల ఒక వంద డెబ్బై ఐదు రూపాయల ఎనభై ఎనిమిది పైసలు మాత్రమే)** మరియు తదుపరి వడ్డీ చెల్లించవలసినదిగా ఋణగ్రహీత మరియు హామీదారులను కోరియున్నారు. **1) మెస్సర్స్ శ్రీ శివ దుర్గా ఫూట్‌వేర్ & జనరల్ మర్చంట్స్ (ఋణగ్రహీత),** మేనేజింగ్ పార్ట్‌నర్ శ్రీమతి దాచేపల్లి సుధారాణి, డి.నెం.13-25, మెయిన్ బజారు, కొండపల్లి, కొండపల్లి మున్సిపాలిటి, యన్.టి.ఆర్ జిల్లా-521228. **2) శ్రీమతి దాచేపల్లి సుధారాణి,** భర్త: డి.నరసింహారావు, **3) దాచేపల్లి వెంకటేశ్వరరావు,** తండ్రి: డి.నరసింహారావు, డి.నెం.14-2, మార్కెట్ సెంటర్, కొండపల్లి కొండపల్లి మున్సిపాలిటి, యన్.టి.ఆర్.జిల్లా-521228. సదరు మొత్తాన్ని చెల్లించుటలో ఋణగ్రహీతల మరియు తనఖాదారు విఫలమైనందున సదరు రూల్స్‌లోని రూల్ 8 తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన స్థిరాస్తిని దిగువ సంతకందారు **తేది. 02-11-2023** న స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఈ స్థిరాస్తితో ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన యెడల అవి **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,** వారికి బకాయి మరియు దానిపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలకు బద్ధులై ఉంటారని ముఖ్యంగా ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తులు విడిపించుకొనుటకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13(8)లోని నిబంధనలు గమనించగలరు.

**స్థిరాస్తి వివరములు**

ఆంధ్రప్రదేశ్-521228, యన్.టి.ఆర్ జిల్లా, కొండపల్లి మున్సిపాలిటి, కొండపల్లి, ఆర్.యస్.నెం.403/1, పాత అసెస్మెంట్ నెం. 1689/ఎ, ప్రస్తుత అసెస్మెంట్ నెం.7440 (డీడ్ ప్రకారం), కొత్త అసెస్మెంట్ నెం. 1944, పాత డి.నెం.8-95, ప్రస్తుత డి.నెం.13-34/2 (డీడ్ ప్రకారం), డి.నెం.13-33 (అసలు ప్రకారం)లో 90 చ.గ.లలో గల భూమి మరియు భవనం శ్రీమతి దాచేపల్లి సుధారాణి గారికి చెందినది ఈ దిగువ హద్దులలో **తూర్పు:** మారెమళ్ళ రామారావు & సన్స్ గారి ఆస్తి, **దక్షిణం:** పంచాయతి రోడ్డు, **పడమర:** దాచేపల్లి కిరణ్ ద్వారా అమ్మిన ఆస్తి, **ఉత్తరం:** దాచేపల్లి సుధారాణి గారి ఆస్తి.

తేది : 02-11-2023 | ప్రదేశం : ఇబ్రహీంపట్నం | సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా


## సంక్షిప్త వార్తలు

**పల్లెకు పోదాం కార్యక్రమంపై అవగాహన**

విస్సన్నపేట: పల్లెకు పోదాం కార్యక్రమం గురించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండలంలో ఈ నెల 9వ తేదీ నుంచి పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి రోజు కొండపర్వ గ్రామంలో ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

**నేడు వెంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రతిష్ట**

పైడూరుపాడు(విజయవాడరూరల్): పైడూరుపాడు గ్రామం కొత్తకాలనీలో బుధవారం ఉదయం వెంకటేశ్వరస్వామి దేవస్థానం నూతన ప్రతిష్టా మహోత్సవం జరుగునని ఆలయ అభివృద్ధి కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమానికి భక్తులు విచ్చేసి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని, అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొంది.


**రామాలయానికి ఫ్యాన్ల బహూకరణ**

మైలవరం: మైలవరం నూజివీడు రోడ్డులోని కోదండ రామాలయానికి రెండు ఫ్యాన్లను భక్తులు అందజేశారు. మండలంలోని చంద్రాల గ్రామానికి చెందిన జూలూరు చంద్రశేఖరరావు రమాదేవి దంపతులు, జూలూరు నాగ శివరామకృష్ణ శ్రావణి దంపతులు వారి కుమార్తె మంగళవారం రెండు సీలింగ్ ఫ్యాన్లు అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు చామర్తి కృష్ణమూర్తి తెలిపారు.

**ఉద్యోగాలకు 51 మంది ఎంపిక**

తిరువూరు: స్థానిక శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ విద్యార్థులకు మంగళవారం క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. మదర్సన్‌కేఎంఈఎల్ సంస్థ బీటెక్ నాలుగో సంవత్సరం చదివే విద్యార్థులకు రాతపరీక్ష, మౌఖిక పరీక్ష నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు తెలిపారు. 200 మంది విద్యార్థులు ఈ ఎంపిక ప్రక్రియకు హాజరవగా, 51 మందికి నియామకపత్రాలు అందజేసినట్లు తెలిపారు. కళాశాల యాజమాన్యం ఎంపికైన విద్యార్థులను అభినందించింది.

### విద్యార్థులకు పోటీలు



తిరువూరు శాఖా గ్రంథాలయంలో దేశభక్తి గేయాల పోటీలు

తిరువూరు: ఈ నెల 14నుంచి జరగనున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం తిరువూరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు దేశభక్తి గేయాలు, పద్యాలు, కథలు చెప్పడంలో పోటీలు నిర్వహించారు. పట్టణంలోని పలు పాఠశాలల నుంచి 60 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి పద్మావతి పర్యవేక్షించారు.

### మిర్చి పంట పరిశీలన



మిర్చి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారి

ముసునూరు: మిర్చి పంటను ఆశించిన బొబ్బర తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఉద్యానవన శాఖాధికారి జ్యోతి ప్రియాంక సూచించారు. మండలంలోని వలసపల్లి గ్రామంలో సాగవుతున్న మిర్చి పంటను సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని వలసపల్లిలోని మిర్చి పంటలో బొబ్బర తెగులు ఉధృతి అధికంగా కనిపిస్తున్నట్టు చెప్పారు. బొబ్బర తెగుళ్ల నివారణ, అధిక దిగుబడుల సాధన, పంటలకు నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన తక్షణ సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని, వేపనూనెను పంటపై పిచికారీ చేయాలని సూచించారు. పంట నష్టం వాటిల్లితే ఆయా గ్రామ రైతు భరోసా కేంద్రాల్లో వివరాలు తెలియజేయాలని సూచించారు.

### ప్రతి విద్యార్థికీ అర్థమయ్యేలా బోధించాలి : డీవైఈఓ

గంపలగూడెం: తక్కువశ్రేణి విద్యార్థులకు సైతం అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని డీవైఈఓ వెంకటప్పయ్య తెలిపారు. గంపలగూడెం మండలం పెనుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన వార్షిక తనిఖీ నిర్వహించారు. పదో తరగతి హిందీక్లాస్‌ను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు బోధనలోమెలకువలను పాటించాలన్నారు. పదో తరగతిలో నూరుశాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు పనిచేయాల్సి ఉందన్నారు. హెచ్ఎం కృష్టాఫర్ పాల్గొన్నారు.





